## 223వ అధ్యాయం

# ٢٢٣ - بَابُ أَمْرِ الصَّائِمِ بِحِفْظِ لِسَانِهِ وَجَوَارِحِهِ عَنِ الْمُخَالَفَاتِ وَالْمُشَاتَمَةِ وَنَحْوِهَا

# ఉపవాసి తన నాలుకను, ఇతర అవయవాలను అధర్మమైన పనుల నుండి, తిట్లు శాపనార్థాల వంటి చెడు చేష్టల నుండి కాపాడుకోవాలి

١٢٤١ - عنْ أبي هُريرةَ رَضِيَ اللهُ عنهُ قالَ: قالَ رسولُ اللهِ ﷺ: «إذا كَانَ يَـوْمُ صَـوْمِ أَحَـدِكُـمْ، فَـلا يَـرْفُـثْ وَلَا يَصْخَبْ، فَإِنْ سَابَّهُ أَحَدٌ، أَوْ قَاتَلَهُ، فَلْيَقُلْ: إِنِّي صَائِمٌ» متفقٌ عليه.

1241. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: మీలో ఎవరయినా ఉపవాసం పాటిస్తే, ఆ రోజున వారు వ్యర్థమైన మాటలు మాట్లాడరాదు. గలాటా చేయరాదు. ఒకవేళ ఎవరయినా తమల్ని దూషిస్తే లేక కయ్యానికి కాలుదువ్వితే వారితో- 'నేను ఉపవాసమున్నానండీ' అని (మర్యాదగా) చెప్పేయాలి.

(బుఖారీ-ముస్లిం)

*(సహీహ్ బుఖారీలోని ఉపవాస ప్రకరణం - సహీహ్ ముస్లింలోని ఉపవాసాల ప్రకరణం)*

### ముఖ్యాంశాలు

ఈ హదీసు ఇంతకు ముందు 217వ అధ్యాయంలో కూడా వచ్చింది. అందులోని అంశం ఈ అధ్యాయానికి కూడా వర్తిస్తుంది. కనుక దానిని ఇక్కడ కూడా ప్రస్తావించటం జరిగింది. ఇందులో బోధింపబడిన విషయమేమిటంటే ఒక ఉపవాసి తన ఉపవాస స్థితిలో ఆహారపానీయాలకు, సంభోగ సంబంధాలకు దూరంగా ఉన్నట్లే తన నాలుకను, ఇతర శరీరావయవాలను కూడా అధర్మ కార్యకలాపాల నుండి కాపాడుకోవాలి. ఒకవేళ ఎవరయినా ఉడికించటానికి,

కవ్వించటానికి ప్రయత్నించినా అనవసరంగా దాని రొంపిలో దిగబడకుండా తెలివిగా తప్పించుకోవాలి. ఎల్లప్పుడూ దైవధ్యానంలో, ఖుర్ఆన్ పారాయణంలో నిమగ్నులై ఉండాలి.

١٢٤٢ ـ وعنهُ قالَ: قالَ النَّبِيُّ ﷺ: «مَنْ لَمْ يَدَعْ قَوْلَ الزُّورِ وَالعَمَلَ بِهِ فَلَيْسَ للهِ حَاجَةٌ فِي أَنْ يَدَعَ طَعَامَهُ وَشَرَابَهُ» رواه البخاري.

1242. హజ్రత్ అబూహురైరా (రజి) గారే చేసిన కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ఎవరయినా (ఉపవాసం ఉండి కూడా) అబద్ధాలు చెప్పటం, వాటిని అమలు చేయటం వదలుకోకపోతే ఆ వ్యక్తి అన్నపానీయాల్ని వదలిపెట్టడం పట్ల దేవునికి ఎలాంటి ఆసక్తి ఉండదు.

*(బుఖారీ)*

*(సహీహ్ బుఖారీలోని ఉపవాస ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

ఉపవాస వ్రతాన్ని పాటించేవారు దాని ఆశయాలను కూడా నెరవేర్చాలని ఈ హదీసు నొక్కి వక్కాణిస్తోంది. ఉపవాసి ఒకవైపు దైవప్రసన్నత కోసం కృషి చేస్తూ, మరో వైపు దైవాగ్రహానికి దారితీసే అధర్మ కార్యకలాపాలకు కూడా దూరంగా ఉండాలి. లేనిపక్షంలో అలాంటి ఉపవాసులకు ఎలాంటి పుణ్యం లభించదు. పైగా ఉపవాసస్థితిలో ఉండి కూడా ధర్మవిరుద్ధ మయిన చేష్టలకు పాల్పడినందుకు పాపాన్ని కొనితెచ్చుకోవలసి ఉంటుంది. (వారి నిరాహార దీక్ష పట్ల దేవునికి ఎలాంటి ఆసక్తి లేదు) అంటే వారు ఉపవాసాన్ని మానేసి తినటం త్రాగటం మొదలుపెట్టాలని అర్థం ఎంతమాత్రం కాదు. ఇదొక హెచ్చరిక. వారు తమలో దైవభీతిని పెంపొందించుకొని చెడులకు దూరంగా ఉండాలన్నదే దాని ఉద్దేశ్యం.